


నోరు ఊరిస్తున్న కేక్‌లు



శుభాకాంక్షలు తెలపడానికి రకరకాల పుష్పగుచ్ఛాలు



రంగవల్లులు కోసం కలర్స్



రకరకాల పూలతో న్యూ ఇయర్ పుష్పగుచ్ఛం

హ్యాపీ న్యూ ఇయర్

నూతన సంవత్సర వేడుకలకు నగరం ముస్తాబైంది. వీధి వీధినా సందడి నెలకొంది. ప్రజల్లో ఫుల్ జోష్ నెలకొంది. నవ చైతన్యం తొణికిసలాడింది. గత సంవత్సరంలో తీపి, చేదు జ్ఞాపకాల్ని మదిలో నిక్షిప్తం చేసుకుని, ఆశావహ దృక్పథంలో నూతన సంవత్సరానికి నగర ప్రజలు సాదర స్వాగతం పలికారు – సాక్షి ఫొటో గ్రాఫర్, గుంటూరు



న్యూ ఇయర్ కార్డులు



బోన్సాయి మొక్కలు కొనుగోలు చేస్తున్న నగరవాసులు



బెలూన్స్

నూతన సంవత్సరంలో అన్ని శుభాలే జరగాలి: మేయర్



కేకును కట్ చేస్తున్న మేయర్ కావటి, డెప్యూటీ మేయర్లు

నెహ్రూనగర్: నూతన సంవత్సరంలో నగర ప్రజలకు అన్నీ శుభాలే జరగాలని మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు ఆకాంక్షించారు. నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ టౌన్ ప్లానింగ్, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో శనివారం నూతన సంవత్సర వేడుకల్ని నిర్వహించారు. మేయర్ కేక్ కట్ చేసి సిబ్బందికి, కార్మికులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2022లో కొందరికి ఒడుదుడుకులు ఎదురైనా, 2023లో అన్నీ శుభాలే జరగాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, రాష్ట్రంలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది, కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని తెలియజేశారు. గతంలో ప్రతి నెలా సమయానికి వేతనాలు అందేవి కావని, నేడు ఎన్నడూ లేనివిధంగా రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా ఒకటో తేదీన అందిస్తున్న ఘనత సీఎం జగన్‌దేనని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు వనమా బాల వజ్రబాబు, షేక్ సజీల, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, నేత తోట ఆంజనేయులు, యూనియన్ నాయకులు ఈదులమూడి మధుబాబు, రవిశంకర్, చందు, కోటి, సుమన్, ఈశ్వర్ నాయక్, నగరపాలక సంస్థ వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

గుంటూరు ఈస్ట్: మహిళ అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు...శివనాగరాజు కాలనీ 7వ లైనులో నివసించే బొందలపాటి దేవి కుమార్తె ప్రియాంక డిసెంబరు 29న ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సింగిల్ నంబరు ఆట నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్టు

సింగిల్ నంబరు ఆట నిర్వహిస్తున్న వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు.వివరాలు.. సంజీవయ్యనగర్ 3వ లైనులో రవిచంద్ర సింగిల్ నంబరు ఆట నిర్వహిస్తున్నాడు. పోలీసులు శనివారం దాడి చేసి అతడ్ని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అతని వద్ద నుంచి రూ. 750 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పలు పాఠశాలల్లో విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న నూరి ఫాతిమా

పట్నంబజారు: తూర్పు నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు శనివారం నేతలు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. రెండో డివిజన్ మణిపురం బొర్రా నాగేశ్వరరావు నగరపాలక సంస్థ పాఠశాల్లో కార్పొరేటర్ మర్రి అంజలి, నియోజకవర్గ మహిళా నేత షేక్ నూరి ఫాతిమా విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు జిలాని పాల్గొన్నారు. ● రైలుపేటలోని గొలుసు నాంచారమ్మ నగరపాలక సంస్థ పాఠశాల్లో అందజేశారు. కార్యక్రమంలో మహిళా నేత నూరిఫాతిమా, కార్పొరేటర్ పోతురాజు సమత, ఎంఈవో ఖుద్దూస్, ప్రధానోపాధ్యాయురాలు ప్రమీలారాణి, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు. ● 12వ డివిజన్ డివిజన్ కింగ్ హోటల్ ప్రాంతంలో కార్పొరేటర్ ఖాజామొహీద్దీన్ చిష్టి ఆధ్వర్యంలో పార్టీ మహిళా నేత నూరిఫాతిమా ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు అందజేశారు.









ఎమ్మెల్యేల నూతన సంవత్సర శుభాకాంక్షలు

పట్నంబజారు: గుంటూరు నగర ప్రజలకు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరి శనివారం వేర్వేరు ప్రకటనల్లో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషాలు వెల్లివిరియాలని, అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధితో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా, ఆనందకరమైన జీవితాన్ని గడపాలని వారు ఆకాంక్షించారు.

ఏఎన్‌యూ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ 2023 సంవత్సర క్యాలెండర్, డైరీ, వీసీ హ్యాండ్ బుక్‌ను శనివారం వీసీ పి. రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడా అవార్డుల గ్రహీతల చిత్రాలు, సందేశాలతో క్యాలెండర్‌ను రూపొందించినట్లు చెప్పారు. యూనివర్సిటీ సమగ్ర సమాచారంతో డైరీ, గత మూడు సంవత్సరాలుగా సాధించిన ర్యాంకులు, అవార్డుల, సర్టిఫికెట్లు వివరాలతో హ్యాండ్ బుక్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. రెక్టార్ పి. వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ బి. కరుణ, సీడీసీ డీన్ మధుబాబు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

గడప గడపలో సంతోషం వెల్లివిరియాలి

పట్నంబజారు: గుంటూరు జిల్లా ప్రజలకు శాసనమండలి సభ్యుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సరం ప్రతి ఇంటిలో ఆరోగ్యం, ఆనందాన్ని రెట్టింపు చేయాలని, గడప గడపలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

సీపీఆర్‌పై ఎంఎల్‌హెపీలకు శిక్షణ

గుంటూరు మెడికల్: స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో శనివారం మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లకు (ఎంఎల్‌హెచ్‌పీ)లకు గుండెపోటు వచ్చినప్పుడు తక్షణమే అందించాల్సిన సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. గుంటూరు జీజీహెచ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్ట్రోక్ వచ్చి పడిపోయినప్పుడు ఛాతీపై రెండు చేతులు పెట్టి సీపీఆర్ చేయడం ద్వారా ప్రయోజనం ఉంటుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుమయాఖాన్, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రావణ్‌బాబు, డాక్టర్ గిరిధర్ పాల్గొన్నారు.

పోలీస్ అధికారుల సంఘ కార్యక్రమాలు విస్తృతం

నగరంపాలెం: ఈ ఏడాది నుంచి సంఘం తరఫున కార్యక్రమాల్ని విస్తృతంగా చేపడతామని ఏపీ విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్యనారాయణ తెలిపారు. బృందావన్ గార్డెన్స్‌లోని సంఘ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాదిలో మరణించిన సంఘ సభ్యులకు నివాళులర్పించారు. ంయుక్త కార్యదర్శి డీవీఎస్ఎస్ మూర్తి, కోశాధికారి యు.మాణిక్యాలరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

















మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు కృషి



నెహ్రూనగర్: నగరంలో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు కృషి చేస్తున్నట్లు మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు తెలిపారు. నగరంలో స్వీపింగ్ కోసం రూ. 42 లక్షలతో కొనుగోలు చేసిన యంత్రాల్ని శనివారం ఆయన నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యంత్రాల వల్ల నగరంలో త్వరితగతిన పారిశుద్ధ్య పనులు చేపట్టడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు వనమా బాల వజ్రబాబు, షేక్ సజీల, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



